సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 2 । నవంబర్ । 2023



పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

ఫైడితల్లి అమ్మవారి జాతర, దసరా పండగకు జిల్లాకు వచ్చిన వారు తిరుగు ప్రయాణ సందడి బుధవారం ప్రారంభమైంది. - 10లో



ఎన్ఎంయూ నిరసన

ఆర్టీసీ ఎం.డి ఇచ్చిన సూచనలను ఎ.డి పాటించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కమిటీ డిమాండ్ చేసింది. - 10లో



మత్స్య సంపద వృద్ధికి రాయితీ

ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీ సభ్యులు ఆర్థికంగా స్థిరపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందిస్తున్నాయి. - 10లో

న్యూస్‌రీల్

బోధనపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఉపాధ్యాయులకు సూచించారు. హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను తొమ్మిది మంది సబ్జెక్టు టీచర్లతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థినుల హాజరు, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలు, లెసన్ ప్లాన్‌లు, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమావాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: లెర్న్ ఎ వర్డ్ ఎ డే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను జారీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లెర్న్ ఎ వర్డ్ ఎ డే సక్రమంగా నిర్వహించకపోవడం, విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచకపోడాన్ని గుర్తించి ప్రధానోపాధ్యాయుడు, పీఈటీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే, మేథ్స్ ఎఫ్ఏ–2 సమాధాన పత్రాలను సరిగా మూల్యాంకనం చేయకపోవడంతో మేథ్స్ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆయన వెంట ఏపీఓ శంకరరావు ఉన్నారు.

సూపరింటెండెంట్‌లకు ఉద్యోగోన్నతి



డీసీహెచ్ఎస్ గౌరీశంకర్‌కు మొక్కను అందజేస్తున్న లక్ష్మణరావు



గజపతినగరం ఏఓ సురేష్

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో కార్యాలయ సూపరింటెండెంట్‌లుగా పనిచేస్తున్న ముగ్గురికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓ)గా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల్లో వారు విధుల్లో చేరారు. విజయవాడ ఏపీవీపీ కార్యాలయంలో పనిచేస్తున్న కిల్లాడ సురేష్‌ను గజపతినగరం ఏరియా ఆస్పత్రి ఏఓగా, విశాఖజిల్లా అగనంపూడిలో పనిచేస్తున్న కిలపర్తి సింహాచలం సాలూరు ఏరియా ఆస్పత్రి ఏఓగా, రాజాం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న లక్ష్మణరావు ఎస్.కోట ఏరియా ఆస్పత్రి ఏఓగా నియామకమయ్యారు.ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విజయనగరంలో ఉన్న జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ బి.గౌరీశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పైడితల్లి హుండీల ఆదాయం రూ.45లక్షలు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆర్‌జేసీ సురేష్‌బాబు

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణ మండపంలో బుధవారం లెక్కించారు. దేవదాయశాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో లెక్కింపు సాగింది. 20 రోజులకు హుండీల నుంచి రూ.45 లక్షల 55 వేల338 నగదు, 75 గ్రాముల 460 మిల్లీగ్రాముల బంగారం, 633 మిల్లీ గ్రాముల వెండి లభించినట్టు ఆర్‌జేసీ పేర్కొన్నారు. వనంగుడి హుండీలను గురువారం లెక్కిస్తామన్నారు. లెక్కింపు ప్రక్రియలో జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓ కె.ఎల్.సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

● తొలిరోజు 70 శాతం పింఛన్ల పంపిణీ

పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం కోడికూయకముందే వైఎస్సార్ పింఛన్ కానుకుల పంపిణీని వలంటీర్లు చేపట్టారు. లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేశారు. ఈ బృహత్తర క్రతువులో వలంటీర్లు, గృహసారథులు నిమగ్నమయ్యారు. జిల్లాలోని 1,44,384 మంది పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.39.65 కోట్లను కేటాయించగా తొలిరోజు 70 శాతం మందికి పింఛన్ డబ్బులు అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. – పార్వతీపురంటౌన్



పార్వతీపురం వైకేఎం కాలనీలో ఎం.కమలకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దిలీప్, గృహసారథులు



పాలకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనిల్



వివేకానంద కాలనీలో కొమ్ములచంటి బాబుకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతి



పార్వతీపురం బైపాస్ కాలనీలో పోతుల చిన్నమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సింహాచలం

జేఏఎస్ శిబిరాల్లో ▸ వైద్యం +ఆహారం

- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- అధికారుల అభ్యర్థన మేరకు జేఏఎస్ కార్యక్రమానికి మధ్యాహ్న భోజనం మంజూరు
- జిల్లాలో ఇప్పటివరకు 1,29,091 మందికి వైద్యం
- ల్యాబ్‌టెస్ట్‌లు: 65,819
- మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసిన కేసులు: 1971

పార్వతీపురంటౌన్:

ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. మన్యంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చేవారికి వైద్యంతో పాటు మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. గిరిజన ప్రాంతం కావడం.. కొండలపై నుంచి శిబిరాలకు చేరుకునేందుకు అధికసమయం పడుతుండడంతో జిల్లా ఉన్నతాధికారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం భోజన సదుపాయం కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఉత్తరాంధ్రలో పార్వతీపురం మన్యంజిల్లాతో పాటు అల్లూరి సీతరామరాజు జిల్లాల్లో నిర్వహించే జేఏఎస్ శిబిరాల్లో భోజన ఏర్పాట్లు చేస్తోంది.

రికార్డుస్థాయిలో వైద్యసేవలు

సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఈ నెల 14 వరకు జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ జారీ



వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది

చేశారు. ఆ మేరకు ప్రతిరోజు శిబిరాలు నిర్వహిస్తున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటివరకు 1,29,091 మందికి వైద్యసేవలు అందజేశారు. ఇందులో స్పెషలిస్టు ఓపీలు 50,346 ఉండగా, మెరుగైన వైద్యం కోసం 1971 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

పక్కా ప్రణాళికతో...

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పక్కా ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా సెప్టెంబర్ 16వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహించింది. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించింది. కేస్ షీట్స్ సిద్ధం చేసింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేసింది. వీరికి ఓపీలను అందజేసి జేఏఎస్ శిబిరాల్లో ఉచిత వైద్యంతో పాటు మందులను అందజేస్తోంది. అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకింద శస్త్రచికిత్సలు చేయిస్తోంది. రోగులు కోలుకునే వరకు పర్యవేక్షించే బాధ్యతలను ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది చూస్తున్నారు.

జిల్లాలో జేఏఎస్ వైద్యసేవలు ఇలా...	
మండలాలు	15
నిర్వహించిన వైద్యశిబిరాలు	276
వైద్యసేవలు పొందినవారి సంఖ్య	1,29,091
స్పెషలిస్టు వైద్యసేవలు	50,346
సాధారణ ఓపీలు	74,967
సుగర్ టెస్టులు	13,102
హైపర్‌టెన్షన్ (బీపీ) పరీక్షలు	21,122
వైద్యసేవలు పొందిన గర్భిణులు	2,746
బాలింతలు	1,537
ఎనిమియా	2,403
ల్యాబ్ టెస్టులు	65,819
ఈసీజీ పరీక్షలు	2,851
ఉన్నత వైద్యానికి రిఫర్ చేసిన కేసులు	1971



ములగ గ్రామంలో జేఏఎస్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. జగన్నాథరావు

మంచి ఆలోచన



జగనన్న ఆరోగ్య సురక్ష కింద పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించడం నిజంగా మంచి ఆలోచన. 15 మండలాల్లో మొత్తం 292 వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, 276 శిబిరాలు నిర్వహించాం. 1,29,091 మందికి వైద్య సేవలందించాం. మెరుగైన వైద్యం కోసం 1,971 మందిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలకు వైద్యసేవలకు వచ్చేవారికి భోజన సదుపాయం కల్పిస్తున్నాం.

– డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం

దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: భామిని మండలంలో నీతి అయోగ్ యాస్పిరేషనల్ బ్లాక్‌ఫెల్లో నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా అర్థగణాంక శాఖ కార్యాలయంలో స్వయంగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు పంపించాలన్నారు. దీనికి సంబంధించి హెచ్‌టీటీపీఎస్://పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో వివరాలు పొందుపరిచామన్నారు. ఎంపికై న వారికి రూ.55వేల వేతనం అందుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 94933 12582 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డోలుకోనకు వెలుగు‘బాట’

గుమ్మలక్ష్మీపురం: ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో మండలంలోని వంగర పంచాయతీ డోలుకోన గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి కనీస రోడ్డు సదుపాయం లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి రోడ్డు సమస్యను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలను మంజూరుచేయించారు. ఈ ఏడాది జూలై 8వ తేదీన కీసర మెయిన్ రోడ్డు నుంచి డోలుకోన వరకు సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో 4 నెలల్లో పక్కారోడ్డు సాకారమైంది. రోడ్డు సదుపాయం కల్పించడంపై సర్పంచ్ పత్తిక జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తిక తిరుపతిరావు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



అధ్వానంగా ఉన్న డోలుకోన రోడ్డు



డోలుకోన గ్రామానికి వేసిన పక్కా సీసీరోడ్డు

అమరజీవి జీవితం ఆదర్శనీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమైనదని, ఆయన త్యాగఫలితమే నేటి ఆంధ్ర రాష్ట్రమని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ (నవంబర్ 1) వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి దేశంలోని అనేక సంస్థానాలు, రాజ్యాలు ఉన్నాయని, వాటినన్నింటిని ఏకం చేసిన పిదప పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రాలు ఏర్పాటుచేశారన్నారు. ఒకే భాష మాట్లాడే వారికి ఒకే రాష్ట్రం ఉండాలని, వివక్షకు గురవుతున్న తెలుగువారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు గాంధేయ వాదంతో ఆరువారాల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన త్యాగ ఫలితంగా ప్రజాగ్రహానికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిటీ వేసి, తెలుగువారి కోసం ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేసిందన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు దేశం, రాష్ట్రం అభివృద్ధికి కృషిచేయాలని, ప్రజల కోసం వారి జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జె.వెంకటరావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి బి.జగన్నాథరావు, డీపీఆర్ఓ ఎల్.రమేష్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు, సవరణకు ప్రత్యేక శిబిరాలు

● కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు నమోదు, సవరణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నవంబర్ 4, 5 తేదీల్లో ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణకు, డిసెంబర్ 3, 4 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. అక్టోబర్ 27వ తేదీన విడుదల చేసిన ఓటరు జాబితా ముసాయిదాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ముసాయిదా ప్రతులను సంబంధిత పోలింగ్ కేంద్రం, బూత్ లెవల్ అధికారి, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. 2024 జనవరి 5న తుది జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, వివిధ పార్టీల నాయకులు సి.ఉమామహేశ్వరరావు, జి.వెంకటనాయుడు, రెడ్డి వేణు, పి.సుధీర్ కుమార్, పి.శ్రీనివాస్, అల్లం ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు రెండు చోట్ల జేఏఎస్ వైద్య శిబిరాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం రెండు చోట్ల జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీ పరిధిలోని పరజపాడు విలేజ్ క్లినిక్, భామిని పీహెచ్‌సీ పరిధిలోని సోమగండి ఎంపీపీ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షతగాత్రులకు ఆర్థిక భరోసా

- శాశ్వత ఉపాధి పొందేలా సాయం: మంత్రి బొత్స సత్యనారాయణ
- గాయాల పాలైన 30 మందికి రూ.1. 29 కోట్ల పరిహారం
- 13 మంది మృతుల కుటుంబాలకు రూ.1.30 కోట్లు
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులకు చెక్కులు అందజేసిన మంత్రి
- బాధితులు కోలుకునే వరకు ఆస్పత్రిలో చికిత్స

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలోని భీమాళి– అలమండ రైల్వే స్టేషన్ల మధ్యలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో గాయపడినవారికి శాశ్వత ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మానవతా దృక్పథంతో సహాయం ప్రకటించారని, గురువారంలోగా బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసే కార్యక్రమాన్ని పూర్తిచేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. తొలుతగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మంగళ, బుధవారాల్లో పరిహారం అందజేశామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం పరామర్శించారు. వైద్యసేవల తీరు, కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారు వేగంగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందనికి సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేరకు రైలు ప్రమాద దుర్ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల వంతున 13 మంది మృతుల కుటుంబాలకు రూ.1.30 కోట్లు పరిహారంగా అందజేస్తున్నామన్నారు. ప్రమాదంలో గాయపడిన 30 మందికి రూ.1.29 కోట్ల పరిహారం అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రమాదంలో గాయపడి శాశ్వత అంగవైకల్యానికి గురైన వారికి రూ.10 లక్షలు సహాయం అందజేస్తున్న సీఎం ప్రకటించారని, ఆ మేరకు ముగ్గురికి రూ.10 లక్షల వంతున రూ.30 లక్షలు అందజేసినట్టు తెలిపారు. నెలరోజులకు పైగా ఆస్పత్రిలో చికిత్స అవసరమైన 15 మందికి రూ.5 లక్షల చొప్పున రూ.75 లక్షలు పరిహారంగా ఇచ్చామన్నారు. నెలరోజుల లోపల ఆస్పత్రిలో చికిత్స పూర్తిచేసుకొని డిశ్చార్జి అయ్యే అవకాశం ఉన్న 12 మందికి రూ.2 లక్షలు చొప్పున రూ.24లక్షలు అందజేసినట్టు వెల్లడించారు. ప్రమాదంలో మృతిచెందిన నలుగురికి గరివిడిలో పరిహారం చెక్కులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే పెనుమత్స సురేష్‌బాబు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ పి.ఎ.రమణి, డాక్టర్ శంబంగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.





సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మినాయుడు, వెంకటరావుకు చెక్కులు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మృతుల కుటుంబాలకు పరిహారం

చీపురుపల్లిరూరల్(గరివిడి): జామి మండలం అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ నష్టపరిహారాన్ని అందజేశారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో గరివిడి మండలం కాపుశంబాం గ్రామానికి చెందిన కరణం అప్పలనాయుడు, పిల్ల నాగరాజు, గదబవలస గ్రామానికి చెందిన మజ్జిరాము, చీపురుపల్లి పంచాయతీ రెడ్డిపేట గ్రామానికి చెందిన రెడ్డి సీతంనాయుడు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని అందజేశారు. కుటుంబసభ్యులు మనోధైర్యం కోల్పోకుండా పిల్లలను చక్కగా చూసుకోవాలని ఓదార్పునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీఓ బి.శాంతికుమారి, ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, లెంక శ్రీరాములు, ఎల్లంటి సత్యనారాయణ, ఎలకల అప్పలనాయుడు, పొన్నాడ కుమార్, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కును అందజేస్తున్న రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ

క్లుప్తంగా

దేవుదళ హెచ్‌ఎంకు మెమో



లక్ష్మీపురం పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీ

రేగిడి: మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధనాతీరుపై బొబ్బిలి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బ్రహ్మాజీ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి పదోతరగతి విద్యార్థుల అభ్యసనపై ఆరాతీశారు. విద్యార్థుల్లో అవగాహన లేకపోవడంపై ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఎటువంటి సమాచారం లేకుండా పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజ్యలక్ష్మి సెలవుపెట్టడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒకే రోజు పాఠశాలకు ఎక్కువ మంది గైర్హాజరు కావడంపట్ల అసహనం వ్యక్తంచేసి, హెచ్‌ఎంకు మెమో జారీచేశారు. అంతకుముందు బూరాడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను, లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసిన ఆయన జగనన్న గోరుముద్ద అమలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, నాడు-నేడు పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.వి ప్రసాదరావు, బి.ఎరకయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ పోటీలకు షేక్ సూరున్నా ఎంపిక



ఎంపికైన షేక్ సూరున్నాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాయిదేవమణి

విజయనగరం అర్బన్: రాజస్థాన్‌లోని జుంజున్‌లో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అంతర్ యూనివర్సిటీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2023-24లో రాష్ట్రం తరఫున పాల్గొనేందుకు స్థానిక సత్య డిగ్రీ విద్యార్థిని షేక్ సూరున్నా అర్హత సాధించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయి దేవమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల స్థాయి పోటీల్లో తైక్వాండో 53 కేజీల విభాగంలో ఆమె ప్రథమ స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. అంతర్ వర్సిటీ పోటీలకు ఎంపికైన షేక్‌సూరున్నాను కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ బి.సూరపునాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఉదయ్‌కిరణ్, కళాశాల అధ్యాపకులు అభినందించారు. :

రైలు ప్రమాదంలో మరో మహిళ మృతి



మృతురాలు ముర్రు లక్ష్మి

విజయనగరం క్రైమ్: రెండు రోజుల క్రితం కంటకాపల్లిలో జరిగిన రైలు ప్రమాద ఘటనలో చికిత్స పొందుతూ మరో మహిళ మృతిచెందిందని జీఆర్‌పీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని గాజువాక దయాల్‌నగర్‌కు చెందిన ముర్రులక్ష్మి (52) కేజీహెచ్ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతురాలిది అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని తోరువోలు గ్రామమని వివరించారు.

పూరిల్లు దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామానికి చెందిన రామస్వామి పూరిల్లు దగ్ధమైనట్లు సర్పంచ్ నేతేటి దీపిక బుధవారం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరగడంతో ఇల్లు దగ్ధమై రూ.40వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు చెప్పారు. ప్రమాద విషయంపై తహసీల్దార్, వీఆర్వోలకు సమాచారం అందించామన్నారు.

పోటీల తేదీ మార్పు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని నవంబరు 3 న నిర్వహించాల్సిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఈ నెల ఆరోతేదీకి మార్చినట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జూనియర్స్ విభాగంలో 6, 7 తరగతి విద్యార్థులకు పద్యపఠనం, ఏవైనా రెండు నీతి పద్యాలు భావయుక్తంగా చదవాలన్నారు. వ్యాసరచన విభాగంలో పుత్తడిబొమ్మ పూర్ణమ్మ గేయం గొప్పతనాన్ని వివరించాలన్నారు. సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు పద్యపఠనం, భాస్కర, దాశరథి, శ్రీకాళహస్తీశ్వర శతకాలలో ఏవైనా రెండు పద్యాలు భావ, రాగయుక్తంగా చదవాలన్నారు. వ్యాసరచన విభాగంలో గురజాడ కన్యాశుల్కం - నాటి సామాజిక పరిస్థితులు అనే అంశంపై ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పోటీ ఉంటుందన్నారు. విజేతలకు ఈ నెల 30న బహుమతులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

- కలెక్టర్ నిషాంత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో నీతిఆయోగ్ ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు కింద ఇన్నోవేషన్ హబ్, అనుభవ పూర్వక అభ్యాస కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. నీతిఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బీవీఆర్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆశావహ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశావహ జిల్లాల కింద పార్వతీపురం మన్యం జిల్లాకు నీతి ఆయోగ్ ప్రోత్సాహకంగా రూ. 3కోట్లు మంజూరు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. ఈ మేరకు అభ్యాస కేంద్రమైన ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించడానికి పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం ప్రాజెక్టును సిద్ధం చేసిందని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడంతో పార్వతీపురం జిల్లాను మరోసారి ప్రశంసించడం పట్ల నీతి ఆయోగ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనుభవ పూర్వకంగా విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం, పరిశీలన, డేటా రికార్డుచేయడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడం, నాణ్యమైన విద్యను సాధించడం, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో జిల్లాలో ప్రతిపాదించామన్నారు.

లక్షల మందికి ప్రయోజనం

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, గిరిశిఖర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నుంచి ఆర్థిక స్తోమత లేని గిరిజన సమూహాల నుంచి 9 నుంచి 12వ తరగతి వరకు గల సుమారు 2లక్షల 21వేల 917మంది విద్యార్థులు ఈ ప్రాజెక్టు నుంచి ప్రయోజనం పొందబోతున్నారని కలెక్టర్ అన్నారు. జేఎస్‌టీయూ, ఆంధ్రా యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి మాస్టర్ ట్రైనర్లను గుర్తించామని, పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ప్రాజెక్టును 15 రోజుల్లో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం యోచిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఆర్డీఓ కె. హేమలత, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారిణి డి. మంజుల వీణ, డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగఫలమే ఆంధ్రప్రదేశ్



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితం వల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.

ఈ మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అలాగే పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అనేక భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని కొనియాడారు. స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి దేశంలో అనేక సంస్థానాలు, రాజ్యాలు ఉన్నాయని వాటిని ఏకం చేసిన తరువాత పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్. శేషాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, సైబర్‌సెల్ ఎస్సై రవీంద్రరాజు తదితరులు ఉన్నారు.

తిరుగు ప్రయాణికులతో ఆర్టీసీకి రద్దీ

- విశాఖ, ఆపై దూరప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- ఆర్టీసీ అధికారులు



శ్రీకాకుళం, విశాఖ ప్రాంతాల వైపు వెళ్లే బస్సుల రద్దీ

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి జాతర, దసరా పండగకు జిల్లాకు వచ్చిన వారు తిరుగు ప్రయాణ సందడి బుధవారం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సేవలకు రద్దీ ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి పట్టణ, పరిసర గ్రామాలకు వచ్చిన జిల్లా వాసులు పండుగను ముగించుకుని తిరుగుప్రయాణం సాగిస్తున్నారు. రైలు ప్రయాణాల్లో భద్రతాలోపం ఇటీవల వెలుగులోకి రావడంతో రెండు,మూడు రోజులుగా ఆర్టీసీ బస్సుల వైపు ప్రయాణికులు మొగ్గుచూపుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి ప్రతిరోజూ విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు నేరుగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. విశాఖ మీదుగా విజయవాడ, హైదరాబాద్ వెళ్లే సర్వీసుల కోసం ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ వ్యవస్థను తీసుకొచ్చారు. రిజర్వేషన్ డిమాండ్‌కు అనుగుణంగా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇవికాకుండా జిల్లా కేంద్రం నుంచి పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, శ్రీకాకుళం, రాజాం, పాలకొండ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడిపారు. దీంతో జిల్లా కేంద్రం నుంచి శ్రీకాకుళం, విశాఖ ప్రాంతాలకు వెళ్లే ప్రతి బస్సు ప్రయాణికులతో కిటకిటాడింది. జిల్లా కేంద్రం నుంచి విశాఖకు ప్రతి 5 నిమిషాలకు ఒకటి వంతున సర్వీసులు నిర్వహించారు. పండగ ముందు రెండు రోజుల మాదిరిగానే బుధవారం కూడా ఓఆర్ 105 దాటి నమోదైందని ప్రజారవాణా శాఖ జిల్లా అధికారి అప్పలనారాయణ తెలిపారు.

4న ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మూడు ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో 205 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 10 గంటల నుంచి బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేళాకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. బయోడేటాతోపాటు పాస్‌పోర్ట్ ఫొటోతో హాజరుకావాలని సూచించారు.

'సంస్కృతి' పోటీల్లో రాజాం విద్యార్థి ప్రతిభ

రాజాం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన సంస్కృతి సంస్థ గత నెల 10న నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీల్లో రాజాంకు చెందిన ఆర్.దేవిక విద్యార్థి ప్రతిభ చూపి పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు ఈనెల 2న హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు సంస్కృతి సంస్థ ఒక ప్రకటన జారీ చేసింది. దేవిక రాజాంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. విజయనగరం జిల్లా స్థాయిలో దేవికకు ప్రథమ బహుమతి లభించిందని పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఎన్ఎంయూ నిరసన

- ఆర్టీసీ ఎం.డి ఆదేశాలు ఎ.డి పాటించాలని డిమాండ్



నిరసనలో ఆర్‌టీసీ ఎన్ఎంయూ జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఎం.డి ఇచ్చిన సూచనలను ఎ.డి పాటించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డిపో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1/2019 నెలలో ఇచ్చిన సర్క్యులర్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చెక్కులపై జీతాలు ఇవ్వాలని, వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని సర్వీసులు తక్కువగా ఉన్న కారణంగా బస్సులను వేరే డిపోకు పంపి ఉద్యోగులను బదిలీ చేయడం ఆపాలని కోరారు. సస్పెన్షన్ పేరిట వేరే డిపోకు బదిలీ చేయరాదని ప్రభుత్వ ట్రాన్స్‌ఫర్ నిబంధనలు అమలు పరచాలన్నారు. కండక్టర్, డ్రైవర్లపై వేధింపులు ఆపాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పీటీ రాఫిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీఎస్‌రాములు, కె.సత్యం, చంద్రమౌళి, బి.రామారావు, ఎం.సుజాత, నీరజ. రాజయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు జేసీ మయూర్ అశోక్ సూచనలతో విజయనగరం మండలంలోని మలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో యుక్తవయసులోనే 58 శాతం మంది గర్భిణులు ప్రసవ సమయంలో మరణిస్తున్నారన్నారు. ఇలాంటి మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే బాల్య వివాహాలను నిర్మూలించడమే మార్గమని పేర్కొన్నారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టంపై విద్యార్థులకు వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. హిమోగ్లోబిన్ 12 శాతం కంటే తక్కువ ఉంటే రక్తహీనతగా గుర్తెరగాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యం చదువుకోసమే అనే వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.సుజాత, ఉపాధ్యాయులు హైమావతి, బి.అప్పారావు, అరుణ, శ్రీదేవి, మూర్తి, రామానుజాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక పరిపక్వత

- నాబార్డ్ డీడీఎం నాగార్జున



శిక్షణార్థులతో మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం నాగార్జున

రాజాం: స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపారాలతో యువతీ యువకులు ఆర్థికంగా పరిపక్వత చెందడమే కాకుండా, ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం ఉందని నాబార్డ్ డిస్ట్రిక్ట్ డివిజనల్ మేనేజర్ నాగార్జున అన్నారు. ఈ మేరకు బుధవారం రాజాం పట్టణంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కన జీఎంఆర్ నగర్‌లో నాబార్డ్ సహకారంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఏర్పాటుచేసిన అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఉచిత స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా 60 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రతి ఒక్క నిరుద్యోగి ముందుకురావాలని పిలుపునిచ్చారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శిక్షణ కాలంలో యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ జీఎం కె.జయకుమార్, నైరేడ్ డైరెక్టర్ రమేష్, ఏపీఎం నాగరాజు, జీఎంఆర్‌వీఎఫ్ సిబ్బంది కె.నాగేశ్వరరావు, ఆర్.అప్పలనాయుడు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌పై దాడికి పాల్పడిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరావు, వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: సర్వజన ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం రాత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆస్పత్రిలో సర్జరీ చేస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సువర్ణకుమార్ వద్దకు చికిత్స నిమిత్తం విశాఖకు చెందిన ఇంటి లక్ష్మణ్, అతని స్నేహితుడు వచ్చి సర్జరీ చేస్తున్న వైద్యుడితో వాదనకు దిగి, దాడికి పాల్పడ్డారు. దీంతో బాధిత వైద్యుడి ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం దాడికి పాల్పడిన ప్రధాన నిందితుడు యశ్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయ మోడల్ మండలంగా వేపాడ



వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీఎం ఆనందరావు

వేపాడ: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మండలంగా వేపాడను ఎంపిక చేశామని డీపీఎం(ప్రకృతి వ్యవసాయం) ఆనందరావు, ఏడీఏ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని సోంపురంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సచివాలయ వీఏఏలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేసేలా వీఏఏలు, ప్రకృతి వ్యవసాయసిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం, కషాయాలు, జీవామృతాల తయారీపై శిక్షణ ఇవ్వాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలను వివరించాలని చెప్పారు. వచ్చే ఖరీఫ్‌లో మండలంలో శతశాతం రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

మత్స్య సంపద వృద్ధికి రాయితీ

- మత్స్యకార సొసైటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు
- ఉచితంగా చేపపిల్లల పంపిణీ
- జిల్లాలో ఇప్పటికే 24 లక్షల 94వేలకు పైబడి సీడ్ అందజేత
- యంత్రాంగం సహకారంతో హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకార రైతులు



:పాలకొండ నియోజకవర్గ పరిధిలో చెరువుల్లో విడిచిపెడుతున్న రాయితీ చేప సీడ్



ప్రభుత్వ ఫిష్ సీడ్ కేంద్రంలో సిద్ధం చేస్తున్న ఫింగర్లింగ్స్

పాలకొండరూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీ సభ్యులు ఆర్థికంగా స్థిరపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందిస్తున్నాయి. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండి ఆ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీలు ఉంటే వారికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్) పథకం ద్వారా చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 శాతం వాటా అందజేస్తోంది. తొలి విడతగా జిల్లాలోని పలు చెరువుల్లో ఇప్పటికే ఉచితంగా చేప పిల్లలను విడిచిపెట్టారు.

ఆదాయ మార్గాలు మెరుగుపర్చేలా..

క్షేత్రస్థాయిలో ఆదాయం లభించే వివిధ రకాల చేపలకే మత్స్యశాఖ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతోపాటు పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఐదు రకాల చేపలను ఎంపిక చేశారు. ఇందులో మూడు రకాలకు ప్రాధాన్యం కల్పించారు. చెరువు నీటిపై ఉన్న చెత్తను ఆహారంగా తీసుకునే బొచ్చె(కట్ల), మధ్యలో ఉన్న అపరిశుభ్రతను ఆహారంగా తీసుకునే గండి (రోహు), దిగువన మట్టికి అనుకుని ఉండి అక్కడ నాచును ఆహారంగా తీసుకునే గడ్డి చేప(మగాల)లకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటిపెంపకం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, చెరువులు శుభ్రమయ్యేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆ చేపలకు కూడా బహిరంగ మార్కెట్‌లో మంచి ధరలు కూడా పలుకుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా మత్స్యశాఖ సమాచారం ఇలా..	
మత్స్యకార సొసైటీలు	35
సొసైటీల్లో సభ్యుల సంఖ్య	4,655
మత్స్యమిత్ర (మహిళా) సొసైటీలు	8
మహిళా సభ్యుల సంఖ్య	488
సొసైటీ చెరువులు	110
గ్రామపంచాయతీ లీజు చెరువులు	75
రిజర్వాయర్లు	4

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

జిల్లాలో 109 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, తోటపల్లి, వెంగళరాయ సాగర్, గుజ్జువాయి, వట్టిగెడ్డ రిజర్వాయర్లలో తొలివిడతగా 24లక్షల 93వేల 142 ఫింగర్లింగ్స్ తీసుకుని వచ్చి చెరువుల్లో వదిలారు. గుమ్మలక్ష్మీపురంలోగల దుమ్మంగి ప్రభుత్వ ఫిష్ సీడ్ కేంద్రం ద్వారా అదనంగా మరో 7లక్షల 20వేల ఫింగర్లింగ్స్(చేప పిల్లలను) ఈ నెల 5వ తేదీన రైతులకు అందించే ఏర్పాట్లు చేపడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ ద్వారా పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గిరిజన మత్స్యకారులకు కేటాయించిన 454 ట్యాంకుల్లో 12లక్షల 98వేల 500 ఫింగర్లింగ్స్ (చేపపిల్లలను) శతశాతం రాయితీపై ఈ నెల 4వ తేదిన ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో అందించనున్నారు. తద్వారా ఎస్టీ మత్స్యకార రైతులను, గిరిజనులను ప్రభుత్వం ప్రోత్సహించాలని భావించింది. దీంతో సంబంధిత గిరిజన మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీల బలోపేతమే లక్ష్యం



జిల్లాలోని 35 సొసైటీల పరిధిలో 5వేల మంది పైచిలుకులకు మత్స్యకారులను, అందులో ఉన్న ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో మత్స్య సంపదను లభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా గిరిజన మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచే నిమిత్తం పూర్తి రాయితీలో చేప పిల్లలను అందించేలా చర్యలు చేపట్టాం.

వేముల తిరుపతయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి